

# ప్రణయ కలహం

యఱ్ఱంశెట్టి శాయి

చిట్టి మిత్తమధ్యాహ్నం పడక్కుర్చీలో కూర్చుని ఓ ప్రఖ్యాత రచయిత్రి వ్రాసిన 'ప్రణయకలహం' అనే చిన్న సైజు నవల ఝుమ్మని చదివేస్తోంది. అందులో కథానాయికా, కథానాయకుడూ ప్రేమించుకొంటూ త్యాగాలు చేసుకొంటూ ఇక ఆట్టే ప్రేమించుకోడానికి టైములేక ఓ మంచి రోజు జూసి పెళ్ళి జేసేసుకొన్నారు. ఆ తరువాత ఓ మంచి కథచే సరిపడే పల్లెటూళ్లో ఓ చిన్న చక్కని ఇంట్లో కాపురం పెట్టేశారు. బోలెడు రోజులు ఇద్దరూ అన్యోన్యంగా ఉంటూ తకీమని ఓ రోజు ఉండటం మానేశారు. ఇద్దరికీ చాలా చిన్న విషయంమీద వివాదం వచ్చింది.

"నా ప్రేమని అపార్థం చేసుకొన్నావ్ మోహన్!" అంది కథానాయిక.

"లేదు అమితా. లేదు! నిన్ను ఇప్పుడే సరిగ్గా అర్థం చేసుకొంటున్నాను. అసలు నా మీద ప్రేమలేదు. అంతా నాటకం" అంటూ ఆవేశంగా జుట్టు పీక్కున్నాడు మోహన్. మాటామాటా పెరిగింది.

అతను అన్నం తినకుండా బయటికెళ్ళిపోయాడు. ఇంట్లో ఆవిడొక్కతే ఏడుస్తూ కూర్చుంది. తరువాత కొంత ఫ్లాష్ బాక్కూ కొంత రచయిత్రి గోరూ అంతా కలిపి యాభై పేజీల నవల నడిచింది. యాభై పేజీల తర్వాత చూస్తే అమిత ఇంకా అన్నం తినకుండా అలాగే కూర్చుంది. సాయంత్రమయిపోయింది. అతను రాలేదు. ఆవిడ భోజనం చేయనూ లేదు. ఆవిడను చూస్తుంటే చిట్టికి ఏడ్చేస్తే బావుండునన్నంత జాలి కలిగింది.

"అబ్బో! అబ్బో! ఈ నవల ఎంత బావుందో!" అనుకొంది గట్టిగా. రాత్రి రెండవడానికి పాతిక పేజీలున్నాయి. అతను వచ్చాడు. ఆవిడ బయట పెట్లో నుంచుని అతనికోసం ఎదురుచూస్తోంది.

"అమితా! నిన్ను అపార్థం చేసుకొన్నాను. నా పాపానికి నిష్కృతి లేదు. నన్ను క్షమించు..." అన్నాడు భోరున ఏడుస్తూ.

"లేదు మోహన్! తప్పంతా నాది. పాపిష్ఠిదాన్ని! నువ్వే నన్ను క్షమించాలి..." అంటూ అతని భుజం మీద వాలిపోయింది అమిత.

ఆ రాత్రి ఇద్దరూ భోజనం చేయలేదు. గాఢంగా కౌగలించుకొని నిద్రపోయారు.

"ఇది మన మొదటి ప్రణయకలహం! అమితా!" అన్నాడతను.

చిట్టికి భలే బావుందది చదువుతుంటే "ఆహా! ప్రణయకలహమంటే ఇదన్న మాట" అనుకొంది. అనుకొని పుస్తకం జాగ్రత్తగా పెట్లో పెట్టేసింది. ప్రణయ కలహం చాలా మధురంగా ఉంటుందని రచయిత్రి చివరిమాటగా వ్రాసింది. అదేమిటో తనకూ ఓసారి అనుభవంలోకొస్తే బావుండును. కానీ ఎలా? తాను ఆయన్తో తన కసలే క్రొత్త. కాపరానికొచ్చి పదిరోజులవుతుందేమో. వారం రోజుల వరకూ అమ్మమ్మ ఇక్కడే వుండి మొన్నే వెళ్ళిపోయింది. అంచేత నిన్నట్నుంచీ భలే సిగ్గుగా ఉండిపోతోంది ఆయన దగ్గర. ఇంత వరకూ పూర్తిగా మనసు విప్పి మాట్లాడను గూడా లేదు. తామిద్దరూ ఒంటరిగా మిగిలిపోవటం నిన్నట్నుంచే! అప్పుడే ప్రణయకలహం అంటే ఏం బావుంటుంది? ఆయనేమన్నా అనుకొంటారేమో! అయినా...ఏమో బాబూ! అందులో ఏదో ఆకర్షణ ఉంది. తన మనసు దానివేపే ఎక్స్‌ప్రెస్ రైల్లాగే పోతోంది, టైము రెండు దాటింది. కళ్ళు మూతలు పడిపోతున్నాయి. రాత్రిసరిగ్గా నిద్రే లేదాయె, ఆయన పోనిస్తేనా? మరీ చిలిపి మనిషబ్బా!...అయినా అంత ఇదేమిటి మరీనూ...బడాయి... ఏదో మత్తు ఆవహించినట్లయింది చిట్టికి. అలాగే నిద్రలోకి జారిపోయింది. మెలకువ వచ్చేసరికి టక్ టక్ మని తలుపు చప్పుడు వినబడుతోంది. 'అయ్యో! ఆయనొచ్చేసినట్లున్నారు.' అనుకొని ఒక్క ఉదుటులో వెళ్ళి తలుపు తీసింది.

రామారావు చిట్టిబుగ్గమీద చిటికె వేసి నవ్వుతూ లోపలికొచ్చాడు.

"ఏం రాణీగారూ! మాంచి నిద్రలో వున్నట్లున్నారే!"

తలుపు దగ్గరగా వేసి అతని వెనుకే నవ్వుకొంటూ నడచింది చిట్టి.

ఇప్పుడే కాఫీ చేసుకొస్తాను!" అంటూ వంటింటి వేపు వెళ్ళింది.

"త్వరగా కానియ్ దేవీ! ఇవాళ సిన్మా ప్రోగ్రాం ఉంది..."

వళ్లు ఝల్లుమంది చిట్టికి 'సినిమా' అనేసరికి. మొదటిసారి ఆయనా తనూ ఇంకా మావయ్యలూ అత్తలూ అన్నయ్యా వదినా అందరూ కలసి సిన్మాకెళ్ళిన రోజు గుర్తుకొచ్చింది. ఆయనా తనూ ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. ఆట మధ్యలో ఛటుక్కున తన బుగ్గమీద ముద్దుపెట్టుకొన్నారాయన. తను అదిరిపోయింది ఎవరన్నా చూశారేమోనని. అనుకొన్నంతా అయింది కూడానూ. వదిన చూడనే చూసింది. ఇప్పటికి కూడా తనకు అందుకే వదినను చూస్తే చచ్చేంత సిగ్గుగా ఉంటుంది.

మెడమీద వెచ్చగా ఊపిరి తగిలి వెనక్కు తిరిగింది చిట్టి. తనను దగ్గరగా లాక్కున్నారాయన.

"పొయ్యిమీద కాఫీపెట్టి కలల్లో విహరిస్తున్నావు. ఆ లోకంలోకి నన్నూ రానియ్యవూ?"

"అయ్యో కాఫీ! వదలండి...ప్చ్..."

అతను నవ్వుతూ వదిలేశాడు. కాఫీ కప్పుల్లోకి వంచిందామె. టైము అయిదున్నరయింది.

ఇద్దరూ కాఫీలు మేకప్పు ముగించి సిన్మాకి బయల్దేరేరు. ఏదో తెలుగు సినిమా. అతను ఎవో కబుర్లు చెప్తున్నాడు. "ఊం" కొడ్తూ వింటోంది చిట్టి. హఠాత్తుగా సినిమా మొదలయిపోయింది. ఆంధ్ర దేశంలోని ఓ పల్లెటూళ్ళో గుడిసెలో కాపురముండే ఓ బీద హీరోయినూ ఓ కడుపేద హీరో మైసూర్ పబ్లిక్ గార్డెన్‌లో పరిగెత్తుతూ ప్రేమ పాటలు పాడుకొంటున్నారు. అదివరకు అదే హాల్లో ఆడిన హిందీ సినిమా తాలూకూ పాట మరచిపోయి పొరబాటున ఝమ్మని తెలుగులో వినబడుతోంది. పాట అయిపోయింది. హీరోయిన్ని హీరో ముద్దు పెట్టుకోబోయాడు. వద్దంది హీరోయిన్.

"ఎందుకని? భయమా?" అనడిగాడు హీరో.

"కాదు! సెన్సార్!" అనరిచారు ఎవరో ప్రేక్షకుల్లోంచి.

"రాజ్, మనం ఎప్పుడు వివాహం చేసుకుందాం?'' అంది హీరోయిను.

రాజ్ తృళ్ళిపడ్డాడు.

"మాధవీ! ఏమిటమ్మా ఈ మాటలు! అయ్యో భగవంతుడా! ఎమిటీదారుణం,' కూతలు నొక్కుకుంట అరచాడురాజ్.

"అదేమిటిరాజ్! అలా అంటావు! నువ్వు నన్ను ప్రేమించ లేదూ?' దీనంగా అడిగింది మాధవి.

"అయ్యో! అయ్యో! ఎంతమాటన్నా వమ్మా మాధవీ! నేను నిన్ను ఓముద్దుల చెల్లాయిగా భావించుకొన్నానేగాని ఎప్పుడూ నిన్ను ప్రియురాలనే ఉద్దేశ్యంతో చూడలేదు చెల్లీ...''అన్నాడు ఏడ్చేస్తూ.

హీరోయిన్ కళ్ళ వెంబడి బక్కెట్టు నీళ్ళు కారినయి.

"రాజ్! ఎంత క్రూరంగా మాట్లాడుతున్నావ్! మనం తోటల్లో ఎన్నోసార్లు కలుసుకొని ఎంతో ఆనందంగా విహరించామే నిన్ను నా సర్వేస్వరుడిగా ఎంచుకొని నేనెన్నో ఆశలు పెట్టుకొన్నానే...'' అంటూ రోషంగా వెక్కి వెక్కి వెక్కి ఏడ్చింది.

హీరో గుండెలు పట్టుకుని బాధగా యాక్టు చేశాడు.

"అయ్యో! అయ్యో! మాధవీ!...'' అన్నాడు.

"హు! నువ్వింత మోసగాడవని కలలో కూడా అనుకోలేదు రాజ్! నాలో ఏం లోపం ఉందని నువ్వు నన్ను చెల్లాయిగా భావించావ్? నన్ను ముద్దు పెట్టుకుంటానని అడిగినప్పుడు చెల్లెలననే భావం నీలో ఏమయింది?''

"ఎంతమాటన్నావ్ మాధవీ! నిన్నో ముద్దుల చెల్లాలుగ భావించి ముద్దు పెట్టుకో బోయానుగాని. వేరే భావం లేనే లేదమ్మా!'' అంటూ భూమధ్య రేఖవేపు వెళ్ళిపోయాడు హీరో.

"పాడు సినిమా! ఏడ్చినట్లుంది!'' అన్నాడు రామారావు చిట్టితో.

అవుననదామనుకుంటూండగా చటుక్కున ప్రణయ కలహం గుర్తుకొచ్చింది చిట్టికి.

ఆయనన్న మాటల్లా కాదంటే సరి. ఎలాగూ ఆయనకోపం వస్తుంది. వెంటనే తను అలిగేసి వేరే గదిలో పడుకోవాలి. అంతే సామిరంగా! దెబ్బతో ప్రణయకలహం అనుభవంలో కొచ్చేస్తుంది...

"ఏమో! నాకు బాగానే ఉంది'' అంది చిట్టి.

"అవున్లే! క్రితంసారి మనం చూసిన సినిమాకంటె బాగానేఉంది'' అన్నాడు తను, చిట్టికేం మాట్లాడాలో తెలీలేదు. ప్లాన్ పారలేదు. తను దెబ్బ తినేసింది. సినిమా అయిపోయింది.

"ఇంటికి టాక్సీలో వెళదాం!'' అన్నాడతడు.

"ఊహు వద్దు! నడిచే వెళ్దాం!'' అంది చిట్టి పంతంగా.

"అవును! వెన్నెల్లో నడుస్తూ వెళ్తేనే బావుంటుంది. ఓ వేళ నువ్వు నడవలేనంటావేమోననుకొన్నా...''

చిట్టి రెండు మైళ్ళు నడవాల్సి వచ్చింది.

"ఏం ప్రణయకలహమో! నడిచేసరికి ప్రాణం మీద కొస్తుంది!'' త్రోవలో అనుకుంది చిట్టి. ఆ రాత్రి ప్రణయ కలహం గురించి ఆలోచించేంత టైము దొరకలేదు. అలిసి పోవడం చేత వెంటనే నిద్రపట్టేసింది. ప్రొద్దున్న లేచేసరికి ఎండయిపోయింది. అప్పటికే రామారావు లేచి ఇంగ్లీష్ పాట పాడు కుంటూ కాఫీ కాస్తున్నాడు. చిట్టి అతన్ని చూసి సిగ్గుపడిపోయింది.

"నన్ను లేప కూడదూ మీతో పాటూ!'' అంది సిగ్గుగా.

"లేపేద్దును గానీ...ఏదీ ఇంకా బాగా తెల్లారందే?'' అన్నాడు రామారావు సూర్యుడి వంక సిగ్గుగా చూస్తూ.

ఆవేళ కూడా చిట్టికి ప్రణయకలహం మాడ్డానికి చోటు దొరకలేదు. ఆ రోజు అంతా ఎలాగా? అని ఆలోచిస్తూనే గడిపింది. మర్నాడు సాయంత్రం నాలు గింటికి ఓ ఉపాయం వచ్చింది. ఆఫీసు నుంచి ప్యూన్ చేత ఓ చీటీ ఇచ్చి పంపించాడు రామారావు.

"చిట్టీ,

సాయంత్రం మీటింగు ఉంది. తప్పనిసరిగా నేను హాజరవ్వాలి. అంచేత ఇవాళ ఇంటికొచ్చేసరికి ఎనిమిదవుతుంది. నాకోసం ఎదురు చూడక. నువ్వు భోజనం చేసెయ్! నీ, రామారావు...''

అని ఉంది చీటీలో.

ఇదే చాలా మంచి అవకాశంలా కనబడింది చిట్టికి. వెంటనే అదే చీటీ తిరగేసి "ఇవాళ ప్రస్తుహో సినిమాకి వెళ్దాం! త్వరగా వచ్చేయండి'' అని వ్రాసి పంపించింది. ఆయనెలాగూ ఇంటికి రాలేరు. తను వెంటనే పోట్లాడేసి హాయిగా మాట్లాడ్డం మానెయ్యొచ్చు. అబ్బో! ఎంత మంచి అవకాశమో! చిట్టి అనుకొన్నట్లు ఏం జరుగలేదు. ఆ సాయంత్రం మామూలుగా అయిదింటికే రామారావు ఇంటికొచ్చేశాడు.

"త్వరగా తయారవు మరి! సినిమాకి వెళ్దాం!'' అన్నాడు చిట్టితో.

చిట్టి ఆశ్చర్యపోయింది.

"అరె! ఏదో మీటింగుందన్నారు గదా! వంట్లో బావుండలేదని ఆఫీసులో చెప్పి వచ్చేశాను!''

"హు'' అంది చిట్టిని స్పృహతో

"అయ్యో! రారనుకొన్నానే!'' అంది విచారంగా.

"అవును! కానీ వచ్చేశాను!''

"అసలు రావటం పడదనే అనుకొన్నాను!''

"ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"హబ్బే! ఏముంది? మీరలా అని చీటీ వ్రాశారు గదా! కాని ఇంతా చేస్తే నాకు తలనొప్పి పట్టుకొంది... సినిమా ప్రోగ్రాం పాడైపోయింది"

అతనికేమయినా కోపం వస్తుందేమోనని పరీక్షగా మొఖంలోకి చూస్తూ అంది.

కాని రామారావు కోపం రాలేదు. పైగా నవ్వేశాడు.

"బావుంది. నాకు బద్దకంగా కూడా ఉంది. హాయిగా డాబామీద కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చు..." అన్నాడు.

"భగవంతుడా! ఈ మనిషికీ జన్మలో కోపంరాదు..." కసిగాఅనుకొంది చిట్టి.

మరో రెండు రోజులూ ఆ తరువాత నాలుగు రోజులూ గడిచి పోయినయి. చిట్టి విసిగిపోతోంది కాని అతనికి కోపం రావడం లేదు. ఓ రోజు కూరలో కిలో ఉప్పు వేసింది. మరో రోజు కారం ఎక్కువ వేసి ఎఱ్ఱంగా రక్తంలా చేసింది. ఇలాంటివెన్ని జరిగినా రామారావు కోపంరాలేదు. ఎప్పుడూ లేనంత ప్రేమగా నవ్వాడు. "ఉప్పు ఓ పలుకూ, కారం ఓ చిటికెడూ ఎక్కువయినట్లున్నాయి, డాళింగ్!" అన్నాడు హాయిగా భోజనం చేసేస్తూ.

నెలఖర్లో రెండొందల రూపాయలు పెట్టి చీరకొనిపించింది. అప్పుడయినా అతగాడి మొఖం వాడి పోతుందేమో దానిమీద తగూ పెట్టుకో వచ్చని.

"షాపువాడు తెలిసినవాడేలే! ఇన్‌స్టాల్‌మెంట్ల పద్ధతిలో తీర్చడానికి వప్పుకున్నాడు చీరబాకీ." అన్నాడు సంతోషంగా ఇంటికి వచ్చి.

చిట్టికి ఉక్రోషం వచ్చేసింది.

అతని మీదపడి జుట్టు పీకేసి రక్కి కోరికెయ్యాలనుకొంది గానీ. ఏమయినా అనుకొంటాడేమోనని ఊరుకుండి పోయింది.

ఓ రోజు సాయింత్రం చిట్టి ఎదురు చూస్తున్న శుభ ఘడియ చిట్టికి తెలీకుండానే వచ్చి నట్టింట్లో నుంచుంది. అప్పుడు చిట్టి పెరట్లో తను ముద్దుగా పెంచుకుంటున్న నెల్రోజుల వయసు గులాబీ మొక్కను స్పూనుతో నీళ్ళు త్రాగిస్తోంది.

శుభ ఘడియ 'చిట్టీ'అంటూ ఇల్లాంతా తిరిగి పెరటివేపు వచ్చింది. చిట్టి శుభ ఘడియను చూసి ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది,

ఎన్నాళ్ళకీ కలుసుకోవటం?"అంటూ కౌగలించేసుకుంది,

"ఏమే! నే(నా)కుండానే పెళ్ళి చేసు


అన్ని రకముల బ్లాకులకు

శ్రీలక్ష్మీ ఎంటర్ ప్రైజెస్

కాళేశ్వరరావు రోడ్. గవర్నరుపేట. విజయవాడ-2

Phone : 7869

కొన్నావ్! పోనీలే! చిన్న తెలీదు లెమ్మని సరిపెట్టుకొన్నా: పెళ్ళయిం తర్వాత ఉత్తరంముక్క కూడా వ్రాయడానికి తీరికలేకుండా ఉంగా మొగుడితో!" అంది శుభఘడియ నవ్వుతూ.

"ఎక్కడే! పుట్టింటి నుంచీ అత్తయింటికీ అత్తింటినుంచి పుట్టింటికీ, ఆడబిడ్డలింటికీ బంధువులింటికీ-తిరిగి తిరిగి-చివరకు ప్రాణేశ్వరునితో సంసారం వెలగబెట్టటాని కొచ్చేసరికి ఈవేళయింది..." అంది చిట్టి

"ఏమో నమ్మాయ్! మా ఆయనయితే బాగాన్ నేర్పాడు మా వదిన నీకు అర్జంటు పనిమీద ఇందాకే మా పిన్నిగారింటికి వచ్చాం! నువ్వూ ఈ వూళ్ళోనే ఉన్నావుకదా గుర్తొచ్చి దార్లో మా యింటి దగ్గర ది అడ్రస్ తీసుకొని మరీ వచ్చాను. మా బంగారు చిట్టిని ఎలాంటి మతిదిగా కట్టుకున్నారో చూసి వెళదామని ...రిక..."

"పదవే! లోపలకూర్చొని మాట్లాడుకుందాం" అంది చిట్టి ఇద్దరూ లోపల కూర్చొని కబుర్లలో మునిగిపోయారు. శుభగడియ చిట్టీ ఇద్దరూ కలి సెవెంత్ ఫారం వరకూ చదువుకొన్నారు. తర్వాత శుభఘడియకి వేరేఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. చిట్టి చదువాపేసిందిగాని శుభఘుగడియ డిగ్రీ పూర్తిచేసి ఓ శుభముహూర్తాన్న ఓ ప్రభాకర్రావుని పెళ్ళాడి ఓ బాబిగాడిని కనేసింది. చిట్టి వివాహానికి హాజరవ్వాలని నడుం విరిగేలా ప్రయత్నించింది కానీ, ప్రభాకర్రావు శెలవు అప్లికేషన్ మీద వాళ్ళ బోడిగుండు ఆఫీసరు 'రిజక్ట్' అని వ్రాసేయడం మూలాన కుదిర్చావలేదు.

కాఫీ టిఫిను పూర్తయ్యాక చిట్టి ఫోటో ఆల్బమ్ తెచ్చి శుభఘడియకిచ్చి 'చూసుకో మా శ్రీవారిని' అంది. శుభఘడియ ఆల్బంలోని చిట్టి పెళ్ళి ఫోటో చూసి కెవ్వున కేక వేసింది.

"ఏమిటే?" అంది చిట్టి కంగారుగా.

"ఓసీ...నీ..." అంటూ పెంకుటిల్లు కాక పోవటం చేత పెంకులెగిరేట్లు నవ్వింది శుభఘడియ.

"అబ్బ! చెప్పవే! సస్పెన్స్‌తో ఛస్తూన్నాను..." అంది చిట్టి డిటెక్టివ్ పుస్తకం చదూతున్న దానిలా.

"నువ్వు జీబ్రాని చేసుకొన్నావా?" అంటూ మళ్ళీ నవ్వు ప్రకరణంలో మునిగిపోయింది శుభఘడియ.

"జీబ్రా ఏమిటే?" అంది చిట్టి ఏడుపు ముఖంతో.

"అదేనే! మీ ఆయన! మా కాలేజీ లోనే చదివాడు. ఎప్పుడు అడ్డచారల చొక్కా వేసుకొస్తూండేవాడు. అంచేత కాలేజంతా కలసి అతని పేరు జీబ్రా అని పెట్టారు. 'జీబ్రా' అని పిలుస్తే చాలు చచ్చేంతకోపం మహానుభావుడికి అలా పిల్చారని ఇద్దరూ జూనియర్ కుర్రాళ్ళను చావబాదాడు కూడానూ."

ఇంకా చాలసేపు మాట్లాడింతర్వాత "ఇక నేవస్తానే!" అంటూ లేచి నిలబడింది శుభఘడియ.

"మాఆయన వచ్చేవరకూఉండవూ." అడిగింది చిట్టి

"లేదోయ్ ఆరింటికి బస్సుంది, అందులో వెళ్ళకపోతే బాబిగాడు మా అత్తగారిని ఉరివేసాడు...వస్తా! మరో సారి వచ్చినప్పుడు ఓ రోజంతా ఉండిపోతాలే! అవతల మా ప్రభాకర్రావు పిన్నిగారి ఇల్లంతా వెంచూసుకొంటూ చిందులు త్రొక్కుతూంటారు ..." అంటూవెళ్ళిపోయింది శుభఘడియ.

చిట్టికి పట్టరాని సంతోషం వేసింది, ఆయనకోపం తెప్పించే కిటుకు తెలిసిపోయింది.

"ఆహా జీబ్రా, వోహో జీబ్రా!!" ఆనందంగా అనుకొంటూ ఇల్లంతా తిరిగింది.

రామారావు ఇంటికొచ్చి చిట్టి ఆనందం చూచి బ్రహ్మానంద బడ్డాడు,

"ఏమిటి సార్ హుషారుగా ఉన్నావ్?" నవ్వుతూ.

"ఏముంది జీబ్రా! ఏమీలేదు!" అంది చిట్టి నవ్వబోతూ

కాని నవ్వకుండానే ఆమె గూబ గుయ్ మంది.

దెబ్బకి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయి.

"మళ్ళీ అను" ఉగ్రనరసింహ మూర్తి కజిన్ బ్రదర్లా ఫోజు పెట్టాడు రామారావు చెయ్యి మళ్ళీ పైకెత్తుతూ.

ఏడుపొచ్చేసిందిచిట్టికి భర్త అవతారం చూసి హడిలిపోయింది,

"రాస్కెల్! ఎంత క్రొవ్వు వెంటనే బట్టలు సర్దుకొని పో మీయింటికి..."

"అదికా...దం..డి నేను సరదాకి.."

"నోర్మూసుకో! ఇకవాగకు త్వరగా స్టేషనుకి నడు... నేను రిక్షా తెస్తాను"

"ఏవండీ!" అని చిట్టి పిలుస్తున్నా విన్పించుకోకుండ వెళ్ళి రిక్షా తీసుకు వచ్చాడు రామారావు.

"ఈ ఒక్కసారి క్షమించండి ఇంక ఎప్పుడూ జీబ్రా...అని..."

చెంప ఛెళ్ళు మంది... "త్వరగా పద"...అట్టే వాగకు..."

చిట్టి వలవల ఏడ్చేస్తూ సూట్‌కేస్ తీసుకొని రిక్షా ఎక్కింది.

ఆమెను రైలు ఎక్కించి టికెట్ ఆమె చేతిలో పెట్టాడు రామారావుల్లా

చిట్టి కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతున్నాయి.

"అయ్యో! ప్రణయకలహ మతం ప్రళయకలహామయిందేం? మరా రచయిత్రి నవల్లో చివరకు సుఖాం? అయిందీ.. ఇక్కడిలా ఎందుకయింది.... ఇదంత తన ఫ్రెండ్స్ చేసిన పని... ఈయన పేరు... ఫలానా అని తనకు తెలీపోతే...ఇంత గొడవ..."

రైలు కదిలింది. చిట్టి వెనక్కు వెళ్ళిపోతున్న రామారావు వంక చూసి భోరున ఏడ్చేసింది. రైలుస్టేషన్ దాటగానే ఆమె ప్రక్కనున్న కిటికీలో నుంచి ప్రణయ కలహం అనే పుస్తకం ముక్కలు ముక్కలుగా బయట పడింది.

★